# సూట్ కేసు

[కథానిక]

= శ్రీ జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి =

దఁవనం, సోడా, అరటిపళ్లు, కిళ్లీ, సిగరెట్లు అమ్మేవాళ్లు ప్లాట్‌ఫారం అంతా కోలాహలం చేస్తున్నారు. బండి కదలడానికి ఇంకా అయిదునిమిషాలు వ్యవధి ఉంది.

పెట్టెకిటికీలోంచి తల పెట్టి సుభద్ర దఁవనంకుర్రాణ్ణి కేకేసింది.

"ఎందుకూ దఁవనం ?"

సుభద్ర తలలో దఁవనమూ, మల్లెపూలూ క్రిక్కిరిసిఉండనేఉన్నై.

"మీకోసం."

రామదాసుకు సంతోషపునవ్వూ, తృప్తీ వొచ్చై.

"వొద్దు. నువు లేకండా అలాంటివాటిని నేను చూట్టం కష్టం" అన్నాడు.

సుభద్ర వోఅణాదఁవనం కొంది. రామదాసు వొద్దంటున్నా.

"మీపర్సు జాగర్తపెట్టుకున్నారా ?"

"వకీలుగారి కిచ్చేది దస్తావేజులతో దాచాను. మిగతా వందా జేబులో—" అన్నాడు రామదాసు, ఆణవాళ్లకు ఉన్న అధికశ్రద్ధకు మెచ్చుకుంటూ.

"ఇదుగోనండోయ్, మీమతిమరుపులో సూట్‌కేసు పారేసుకునేరు! సమస్తమూ ఇందులో ఉన్నై."

"ఛ !"

"ఛా లేదు, ఛీ లేదు! మన ఆస్తి అంతా ఇందులో ఉంది."

"నాకు తెలీదులే—" సుభద్రను రామదాసు దగ్గిరకి లాక్కోబోయాడు. నిగ్రహించుకున్నాడు.

"లక్ష్మయగారిని రేపు కలుస్తారా?"

"వాయిదా యింకా నాల్రోజులు ఉంది గదా. ఆఁ. రావటానికి ఓవారం పట్టచ్చు."

"వారంరోజులే ?"

"ఏం, ఏం?"

"నే నొక్కత్తెనూ ఉండలేనమ్మా!"

రామదాసు నవ్వాడు.

"అక్కడ ట్రాములూ, కార్లూ నడవడం చాలా కష్టం అన్నారు...జాగర్తగా నడుస్తారా ? చేతిలో చెయి వేయండి."

"మరి నువు నీళ్లు తోడేప్పుడు గాడి నుయ్యి 'తాగాడు' మీద కాలేసి తోడ్తావు గదా...జాగర్తగా తోడుతానని మీ హిందీలో చేతిలో చెయ్యి వెయ్యి."

సుభద్ర ఫక్కున నవ్వింది. సుభద్ర—కాపరానికి వొచ్చిన కొత్తలో గాడినూతిలో పడ్డది. ఫక్కున నవ్విందన్న మాటేగాని—వెనకటి స్మరణవల్ల మొహం కొద్దిగా రంగు మారింది.

రైలు కూతేశింది. సుభద్ర జాగ్రత్తలు మరీమరీ చెబుతూ కిందకు దిగింది. గార్డు యీలవేశాడు. బండి చీమలా కదిలింది.

"బిదా లేతాహుఁ" అంది సుభద్ర-ముద్దుగా కనుకొలుకుల్లోకి చూస్తూ.

"అచ్ఛా"అంటూ రామదాసు నవ్వాడు.

బండి బాగా కదిలింది.

చెయ్యీ చెయ్యీ కలిపి సుభద్ర ప్లాట్ఫారంమీద పది అడుగులు నడిచింది. సుభద్రతల దూరంగా కనిపించేదాకా రామదాసు చూసి, చెయ్యి ఊపి, ఆలోచనల్లో పడ్డాడు.

పర్సులో టిక్కెట్టు పెట్టి, పర్సు కోటు లోపలి జేబులో పెట్టుకుని, సూట్ కేసు జాగ్రత్తగా చూచి, సిగిరెట్టు అంటించి, దావావిషయాలు ఆలోచిస్తూన్నాడు.

టీకు టాకుగా ఉన్న ఓ తెలుగమ్మాయి దర్జాగా ఇంగ్లీషునవల చదువుతూ చీర సర్దుకుంది. పెట్టెలో జనం కదులుతూ రైలు హోరుకు ఉపశ్రుతిగాక భుర్రువిడేసింది. రామదాసు చల్లగాలికి కునకడం ప్రారంభించాడు. సుళ్లూరుపేటలో ముఖం కడిగి, నాలిక కాలే కాఫీ తాగి, పొన్నేరిలో ద్వితీయవిఘ్నం కాకుండా చూసి, సెంట్రల్ లో దిగాడు.

ఆ గాభరాలో ముందే దిగడానికి తయారై ఉన్న ఆ ఆణపిల్ల దిగిపోయింది పెట్టె తీసుకునీ, హోల్డాల్ తీసుకునీ.

రామదాసు సూట్కేసు తీసుకుని, నెమ్మదిగా ట్రాంమీద పార్కు వెళ్లి హైకోర్టుకు దగ్గిరగా ఒక హోటల్ లో దిగి, గది చూసుకుని, స్నానం చేద్దామని పెట్టె తియ్యబోయాడు.

"అరె!"

పెట్టె మారింది !!

ఓనిమిషం కొయ్యబారిపోయాడు. ఎల్లా జరిగింది ?

దావా ఏం కావాలి? దస్తావేజులూ, దస్తావేజులతో ఉన్న రెండువందలకూ నీళ్ల ధారేనా ?

బుర్ర పని చెయ్యడం మాని, కొయ్య బారింది.

వో సిగరెట్ తగలేసి, సరే—యీ పెట్టె ఎవరిదో వారిని కనుక్కుంటే తేలుతుందిగదా అని చూచాడు. చూస్తే — సరీగా తన తాళంలాంటి తాళమే. తాళం చెవి పర్సులోంచి తీసి, తీశాడు వొచ్చింది.

"ఖుదా ! సూట్ కేస్ ఆ స్త్రీది !"

అన్నీ ఫ్రాకులూ, స్కర్ట్లూ, చీరలూ, దువ్వెనా, అద్దం, తలనూనె, షోకైన చెప్పులూ, చేరుమాళ్లూ, తువాళ్లూ ! వాళ్లంతా చిరచిరలాడుతోంది, పేలి ఉందేమో. రెండు తువ్వాళ్లు తీసుకుని స్నానం చేద్దామని తీశాడు గాని, ఆణదంటే హడల్ వల్ల ఆగిపోయాడు. లేచి, పర్సు తీసుకుని, గది తాళంవేసి, బట్టల దుకాణంకేసి వెళ్లి, నాలుగు ధోతూలూ, నాలుగు రెడీమేడ్ షర్టులూ, రెండు తువ్వాళ్లూ కొనుక్కుని, యింటికి టెలిగ్రాంఇచ్చి, వొచ్చాడు.

కొన్న సామాను మంచంమీద పారేశాడు. తువ్వాలాలు తీసుకుని స్నానాలగది కెళ్లాడు. సబ్బు?

మళ్లీ గదిలోకి వొచ్చి, బెరుకుబెరుకుగానే ఆవిడపెట్టెలోని సబ్బు తీసుకెళ్లాడు.

తోముకుంటూంటే— ఏం పరిమళం? మా హాయిగా ఉంది!

స్నానం చేసి, ఆమెతలనూనెతోనే తల దువ్వుకొని, గది తాళంవేసి, కాఫీ తాగి, భోంచేసి, గది కెళ్లాడు.

తల ఎంత సువాసనగా ఉంది? ఈ ఆణపిల్లలు— ఈ కాలంలో మరీను-ఏం గుబాళిస్తూఉంటారు!

కనిరెప్పలమీద ఉయ్యాల ఊగుతోంది నిద్ర. మంచంమీద బట్టలు సర్ది, పడుకుని, దావా, దస్తావేజులూ, బద్ధకం, చిరాకు, చిరచిరలతో నిద్దరపోయి లేచాడు.

నాపెట్టె పోయిం దంటూ ఎవ్వరూ రాలేదు. తనే వెతుక్కుంటూ పోయి ఇస్తే-? ఎవరికనీ ఇవ్వడం?? ఎవరిదో తెలుస్తేగా?

అడ్రసైనా దొరుకుతుందేమో నని ఆ సూట్‌కేసు అంతా గాలించాడు. చీరలు తీశాడు. అన్నీ తీశాడు. అవన్నీ మల్లెపూల లాగా పరిమళించడమే గాని, ఏమీ చెప్పవు. మల్లెపూలైనా మేలే-తర్వాత కథ చెబ్తై.

పెట్టె ఎంత కెలికినా రేజా అంత అయినా ఆచోకీ తెలీలేదు.

రామదాసు అవన్నీ అలాగే సర్దబోయి, ఓడిపోయి, వొక్కటే దీక్షగా వాసన చూశి, కప్పుకుని చూశి, ఆనిక్క సర్దుదాంలే అని బట్టల స్టాండుమీద పారేశి, గదితలుపు తాళంవేశి, బయిటికి వెళ్లాడు.

కాఫీహోటల్, ఆక్వేరియం, బీచి, సినీమా అన్నీ చూచి, రాత్రి గదికి చేరుకుని, తనకోసం ఎవరైనా వొచ్చారా అని గుమాస్తాను అడిగి, వాడు తనకు తెలీదంటే - వెళ్లి భోంచేసి పడుకున్నాడు.

రాత్రంతా కలలు. భయం, దిగులు, విచారం, ఆనందం, నేలా వేళా విడిచిన చోట్లు, గమత్తుగమత్తు కలలు—అన్నీ తనకు తెలీనివీ తెలిసినవీ—అదోప్రపంచం!

తెల్లారింది.

“సాయింత్రం మీకోసం ఎవరో వొచ్చారు సార్” అంటూ బాయ్ చెప్పాడు.

“ఎవరు?”

“ఎవరో, తెలుంగే మాట్లాడారు, స్త్రీ.”

పాపం, ఆవిడా సూట్‌కేస్‌కోసం వేటాడుతోందికాబోలు!

అరె, తను లేనప్పుడు వచ్చిందే? ఆవి డేం కలశన్నదా ... తను లేని టైం అని!

మనిఆర్డరేమన్నా వొచ్చిందా అని రామదాసు హోటల్‌మేనేజర్ను కనుక్కున్నాడు. రాలేదట. ఎందుకు కట్టలేదు చెప్మా? ఒలిగ్రాంమనిఆర్డరు ఇమ్మన్నాడే? అంతా స్పష్టంగా రాశాడే. మోసం జరిగిందీ-మూడువందలు పంపమన్నాడుగదా, సుభద్ర ఎందుకు పంపలేదు చెప్మా? ఇంట్లో ఉన్న సొమ్ము కట్టడంకాని, ముప్పైత్రినట్టు మరేం నోటురాసి తేవాలా?

సుభద్ర బద్ధకించిఉంటుందా? సుభద్రే-బద్ధకించడమే? కాపరానికి వొచ్చింది మొదలు కంటికి రెప్పకాదూ.

మద్రాసువీథు లప్పుడే కలకలలాడుతున్నై. ముష్టివాళ్లు వెత్తలపాకు నోళ్లతో

తరమడం ప్రారంభించారు. బస్సులు చెడు గుడు ఆడుతూన్నై. సుభద్ర యీ ఊరు చూస్తేనా? వారంరోజులుదాకా కదలదు. ఊరంతా తిరిగిగాని కొంపకు చేరుకోదు. ఆణవాళ్లు, పాపం, అణిచిపెట్టబడ్డారుగానీ— అన్యాయం! సగం జనాభా చదువులేని దైందయ్యే.

రామదాసుమనస్సు పిచ్చాడిమనస్సంత పదనుగానూ ఆలోచిస్తోంది. ఓచోట కూచో నీకండా లోపలసించి ఆవేశంలాంటిది తన్ను తోంది. కాలుకాలిన పిల్లిలా, పేవ్‌మెంట్లపైన అటూ ఇటూ నడిచి, బ్రాడ్వేకు వెళ్లి పత్రిక కొనుక్కుని చదివి, రామకృష్ణలో కాఫీ మళ్లీ తాగి, నెమ్మదిగా పత్రిక చదివి, గదికి వొచ్చాడు. మెయిలు అప్పుడే వొచ్చి అరగంట అయిందిట.

దేహబాధ తీర్చుకుందామని లేచి, అలాగే స్నానం చేసి రావచ్చుకదా అనుకుని, సరేలే — స్నానానికి వొచ్చే వెళ్లచ్చులే అని గదితలుపు వేసి, వెళ్లి నెమ్మదిగా అడుగులేసుకుంటూ వొచ్చాడు. ఈ మద్రాసులో అదోటి అసయ్యం. మంది మనమే నీళ్లతో కొట్టెయ్యాలి. ఏం అసయ్యంలే, అలవాటు లేకగాని, అయితే, చాలా మంచిదిగాదూ? రామదాసు కాలుస్తూన్న సిగిరేట్‌పీకను అవతల పారేశాడు. గదిలోకి వొచ్చాడు. తువ్వాలా చుట్టుకుని, నిన్నటిసబ్బే తీసుకుని, తలుపు వోరవాకిలిగా వేసి, స్నానాలగదిలోకి ఏదో సినిమా పాట పాడుకుంటూ వెళ్లాడు.

*　　*　　*

సుభద్ర వెతుక్కుంటూ వొచ్చింది. ఊరు కొత్త. తిరిగి తిరిగి అలిసిపోయింది. ఏడుపు వొస్తోందన్న మాట. బింకానికీ, మనుష్య అజ్ఞాతప్రయత్నానికీ ఆ ఏడుపు ఇగిరిపోతోందిగాని.

మోసం జరగడమేమిటీ - వెళ్లిన్నాడే మళ్లీ మూడువందలు పంపమనడం ఏమిటి? ఏవిటా మోసం? మోసమే జరిగితే యీ దావా గంగలో కలిసినట్టేనా? ఇంత మైమరుపుమనిషైతే ఎలాగమ్మా కాపరం తగలడ్డం? తను కంటికిరెప్పగా కాపాడబట్టిగాని, లేకపోతేనా—ఎల్లా యీమనిషితోవేగడం? అక్కడికీ రైలు కదిలేదాకా శతపోరి చెప్పిందిగదా.

దయ్యమంత సెంట్రల్‌స్టేషనులో దిగి, లక్ష్మయ్యగారు మైలాపూరులో గనుక మైలాపూరు — స్టేషన్‌దగ్గిర రోడ్డు క్రాస్ చేసి—వెళ్లింది, వెతుక్కుంటూ.

ప్లీడరుగారు ఇంటోనే ఉన్నారు. యింకా యీన ప్లీడరుగార్ని కలుసుకోనేలేదన్న మాట. తను వెళ్తే పని ఛప్పున నిమిషాల్లో తెమిలిందే. యీ మొగాళ్లు ఇంతే. ఇంటో దబాయిస్తారుగాని బయిటి కొస్తే బహు మెతక, ఇట్టే నానిపోతారు!

గుమాస్తా నిమిషంలో డైరీ చూసి చెప్పాడే-అవతలిపార్టీ మళ్లీ వాయిదా అడగచ్చనీ, వాయిదా పడవచ్చనీ. తనూ వాయిదా కోరమంది.

మరి, ఏంచేస్తుంది? దస్తావేజులూ, డబ్బూ తెచ్చిన మొగుడా... మోసంజరిగింది, మళ్లీ డబ్బుపంపమని టెలిగ్రాంఇచ్చె. ఇంకా నయం, తను తెస్తుందని తెలీక, టెలిగ్రాంమనిఆర్డరు రాలేదని ఏంఏం తిట్టుకుంటున్నాడో. తిట్టడులే. ఆయనకు తిట్టడం

చాతకాదు. లోపల్లోపల ఫదిసార్లు అనుకుంటారు. ఇంతకూ ఆమోసం ఏమిటీ— ప్లీడర్నిగూడా చూడకండా ఈన హోటల్లో ఏం చేస్తున్నట్టు ? కిందటిసారి దిగిన హోటలు ఫలానా అని చెప్పాడు గుమాస్తా. యీ సారీ అక్కడే దిగాడు. టెలిగ్రాంలో అడ్రస్ ఇచ్చాడుగా !

అక్కడ ఎవత్తైనన్నా మరిగారా ? ఛ ! ఎవత్తె నమ్మింది మొగాళ్లని? బాగానే ఉంది కథ !

బస్సులో కూచ్చుని దిగేవరకూ యీ ఆలోచనల్తోనే సుభద్ర తన్ను తాను మరిచింది. బస్సువాడు హైకోర్టు అని అరవక పోతే తను దిగేదే కాదు.

హోటల్ వెతకడం ఏం కష్టంకాలేదు. గదినెంబరు తెలుసుకుని, హోటలుకుర్రాడు చూపించగా గదిలోకి వెళ్లింది సుభద్ర.

గదితలుపు వోరవాకిలిగా వేసిఉంది. ఇంకేం? మహారాజు లోపల శింగురంగా అని నిద్రిస్తున్నాడు కాబోలు ! పాపం, రాత్రి అంతా అలిసిపోయి!

గదిలోకి అడుగుపెట్టాక సుభద్రప్రాణాలు చిప్పుమన్నాయి. తన మొగుడేనా ఇక్కడ ఉంట? ఆహా! ఆకోటు ఆయిందే! సుభద్రకు అసహ్యం ముంచుకొచ్చింది. పరాయిఆడదాంతో భర్త కులకడం! ఇదా జరిగిన మోసం? ఇందుకా మళ్లీ మూడు వందలు? వందలుకాదు; బొందలు! దాని ఎదాన కొట్టడానికా ?

గదినిండా చీరలూ, జాకెట్లూ, అందమైన చెప్పులూనా ? గర్భాధానంగదిలాగు సువాసనలా? ఇంతకూ ఆమహాఇల్లా లెక్కడి కెళ్లిందీ? వీపు రుద్దడానికా? స్నానం చేస్తున్నారటగా అయ్యగారు? ఇంతకూ ఎవత్తె అది? మొన్న రైల్లో తారుతీకుగా ఎక్కిన వన్నెలవిసినకర్రా? అదే అయిఉంటుంది. తను దిగ్గానే దాంతో సరసాలాడి, ఆడించి, మరిగి, మరిగించిఉంటాడు. ఇంతే, మొగాళ్ల జన్మ! తను ఎంతకాలం గోతిలోపడ్డదీ! ఏకపత్నీవ్రతం, అర్టు అంటూ ఉపన్యాసా లిచ్చే వాడే రామదాసుగారు !!

సుభద్ర స్టాండుదగ్గిరికి వెళ్లి చీర చూసింది. మెరమెరలాడుతూ... చక్కగా కడిగిన ముత్యంలా ఉంది చీర. చెప్పులు చూసింది. ముద్దొస్తున్నై. బాడీలూ, రెవికలూ చూసింది. నలక్కండా గుబాళిస్తున్నై. స్నానం చేసి వేసుకోడానికి బయటకు తీసి ఉంటుంది. తలనూనె చూసింది. ఏం పరిమళం ! ఇల్లా డబ్బు తగలేస్తారు కాబోలు ! ఇంటో తెమ్మంటే—పోరితేగాని తీసుకురా రే ?

అద్దంముందు నుంచుని చూసుకుంది. తన మొహం అసహ్యంగా ఉంది-వొళ్లంతా పేలి, పొట్టురేగి, రైలుబొగ్గు పడి, అట్టలు కట్టి.

* * *

"నమస్కారమండీ"

మొగుడిగొంతుకే! ఆకొత్తదాన్ని ఇలా పిలుస్తాడు కాబోలు. ఏడు పొస్తోంది.

"దాన్నేనా—?"

ఉరిమింది సుభద్ర.

చెప్పులు విడిచి, గదిలోకి వొచ్చాడు రామదాసు.

"ఎప్పుడు వొచ్చా?" అన్నాడు.

"ఏం, రావడం ఇష్టంలేదా ?"

"అల్లా మాట్లాడుతావేం?"

"..............."

"రైల్లో మేలుకుని ఉంటావు, స్నానం చేద్దుగాని రా"

"దాన్ని రానీండి, చూసి మరీ పోతాను"

"అది ఎవత్తే—పిచ్చిదానా?"

"పిచ్చిదాన్ని గనకనే ఆడిస్తున్నారు!"

సుభద్రగొంతుక రోషంతో కషాయితం ఐంది.

"ఓహో!- ఆమే ? ఇంకా రాలేదు" అంటూ భార్యదగ్గిరికి వొచ్చాడు రామదాసు

"నన్ను ముట్టుకోకండి– అది అనగూడదేం ? ఆమె– పడిశేటిముండను !"

"ఛా! పిచ్చిదానా- ఎవ్వరూ లేరు."

"లేకేం?"

"ఏఁవిటీ వెర్రి" అంటూ భార్యను రామదాసు సమదాయిస్తున్నాడు మాటలతో. ధోతి కట్టుకుంటూ.

"ఈ భాగోతం ఏమిటండీ–" అంటూ సుభద్ర అడిగింది. గొంతుక ఆక్రోశిస్తోంది. మాట కాలుతూ వొస్తోంది. బొడ్డుదగ్గిర్నించీ నాదం పలుకుతోంది.

"అదుగో– ఆమె– వి– పెట్టెలు మారాయి. నిన్న నాకోసం వొచ్చిందిట-"

"ఊఁహూఁ, వొచ్చిందీ మీకోసం ? ఇంకేం ?"

"అదిగాదే ?"

"నన్ను ఇంకా గోతిలోకి తొయ్యకండి—" సుభద్రకళ్లంబడి నీళ్లు కారుతున్నై.

రామదాసు దగ్గిరికొచ్చి, ముట్టుకుని, వొళ్లు నిమిరాడు. తల రొమ్ముకు ఆన్చుకున్నాడు. సుభద్ర వెక్కుతోంది.

ప్రసంగం తప్పిస్తే మంచిదని రామదాసు "వొళ్లు ఇల్లా పేలిందేం" అంటూ సుభద్రమెడ ఎత్తాడు.

"పనికి రానప్పుడు పేలితే ఏం, నేను కాలితే ఏం" ఏడుస్తూనే అంది సుభద్ర.

రామదాసుకు ఏమీ పాలుపోటం లేదు. తను ఎవత్తెతోనో ఉంటున్నానను కుంది సుభద్ర. రామదాసుకు అర్థమై, మరీ దిగులేస్తోంది. ఏం గ్రహచారం! తన్ను భార్య అనుమానించడం ? పోయిన డబ్బు పోగా, కోర్టుకాయితాలూ, దస్తావేజులూ ఏమైనయ్యో అంతులేకపోగా భార్యా అనుమానించడమా ?

"ఒసే, నన్ను నమ్మూ—"

"ఎందుకండీ నమ్మడం, కళ్లతో చూస్తూ—"

"టెలిగ్రాం అందగానే, గాభరాపడి, మెయిలుకు వొచ్చావా..."

"ఆఁ, చూసి సంతోషిద్దామని అంగలేసుకుంటూ వొచ్చాను."

"నీకేదో తిక్కతిరిగింది—ఇది నీఅంతట నీకు పోవాలిసిందే."

"పోనీండిగాని, మీరు ప్లీడరుగారింటికి వెళ్లారుటండీ ?"

"ఊఁహుఁహ్."

"దాని వలలోపడకపోతే వెళ్లకుండా ఉండేవారేనా? నే నిటు వెళ్లి, రైలు కదలగానే, అది మీకు ఉచ్చులు పన్నింది కాబోలు?"

"మళ్లీ ఎగరొొప్పతున్నావు. అది ఎవత్తో నేను ఎరగను"

"రామాయణం అంతా అయినా రాముడికి సీత ఎవత్తో తెలీదుట — అల్లా ఉంది"

"నువ్వెప్పుడూ ఇంతే. చెప్తే వినవు."

"'నీమీదాన మటొక్కతెన్ నినువినా నే నెక్కడన్ చొక్కనే.' — శివుడే అబద్ధాలాడాడు పార్వతితో — మీరు లెక్కా?"

"కవి రాశాడు అది. అంతే. దస్తావేజులూ, డబ్బూ లేందే ప్లీడరును ఎలాచూట్టం?"

"నేను మాట్లాడి రాలా?"

"ఎప్పుడొచ్చావూ — ఎప్పుడు వెళ్లి మాట్లాడావూ?"

"మరేం చెయ్యనూ? మొగుడు మోపి దేవి పోతే —"

ఇద్దరికీ వొచ్చింది నవ్వు. సుభద్ర బల్లెం గుచ్చినట్లు కళ్లతో చూసి నవ్వు ఆపుకుంది. రామదాసు నవ్వుతున్నాడు.

"ఏమన్నాడు ప్లీడరూ?" అన్నాడు నవ్వాపి రామదాసు.

"ఎగస్పార్టీ వాయిదా కోరవచ్చుట. గుమాస్తా చెప్పాడు. దస్తావేజులూ, డబ్బూ, మొగుడూ పరారీగనక నేనూ వాయిదా కోరం డని రెండు వందలూ జమకట్టించి వొచ్చాను."

రామదాసు భార్యను దగ్గిరికి తీసుకుని, ముద్దెట్టుకున్నాడు.

"వొళ్లంతా పేలింది — మీకు పనికి రాదు కాబోలు"

రామదాసుకు నవ్వు వొచ్చింది.

"ఫరవాలేదు, నాకూ పేలిందిలే — కాస్త గంధం కలుపుదుగాని ఆనిక్క" అన్నాడు నవ్వుతూ.

"నవ్వు ఎల్లా వొస్తుందండీ? అది వొచ్చి కలిపి పూయదూ గంధం" అంది సుభద్ర ఈసుగా.

"పిచ్చిదానా, నేనే ముండను — నాకేం ముండే" అన్నాడు.

"పిచ్చాడు నీకు పిచ్చి అంటే వొప్పుకుంటాడా?" అంది సుభద్ర.

రామదాసు స్తబ్ధుగా ఉన్నాడు. లోపల ప్రేమసముద్రం ఆటూ పోటూ — పోటు కోసం ఆటుతీస్తోంది.

"ఈ చీరలూ, తలనూనే దానివేనా?"

"ఏం, ఏం?"

"కొన్నా రేమో నని."

"దానివే."

"ఎల్లా నోరొచ్చిందండీ దానివే అని చెప్పడానికీ—"

రామదాసు కొత్తగా విమానం చూసినట్లు చూస్తున్నాడు భార్య మొహాన్ని. ఎర్రదనం పోతోంది. మామూలు పచ్ఛదనం వొస్తోంది.

*　　*　　*

"రామదాసుగారున్నారా?"

"ఆఁ. ఎవరో? రండి!"

ఆకుచెప్పులతో వొక విద్యాసుందరి వొచ్చింది. తన చీర ట్రాంకుమీద ఉండటం చూసి, ఆమె మొహం మారుతోంది. సుభద్ర కొంచెం పక్కకు తప్పుకుంది.

పరిస్థితులు ఎంత ఆడించినా, మళ్లీ స్వభావమే పరిపాలించేది మరి!

"క్షమించండి! నిన్న పొద్దున మీపెట్టె - పొరబాటున నాపెట్టె అనుకుని తీసుకెళ్లాను."

"తమదా? స్టేషన్ దిగి, నాదే గదా అనుకుని తెచ్చుకున్నానండీ!"

"సారీ. నారూంకు వెళ్లి మామూలుగా తీశాను. తాళాలుగూడా ఒకరకమల్లే ఉంది. ఈజీగానే వొచ్చింది"

సుభద్ర లోలో రగులుకుంటోంది. ఏం మోసం?

"నిజం"అన్నాడు రామదాసు.

"ఏం ? మీకూ అంతేనా ?" అంది ఆమె.

"ఎగ్జాక్ట్లీ"రామదాసు అన్నాడు.

సుభద్ర ఆఇంగ్లీషుమాటకుతలఎత్తింది, చెవితో చూస్తున్న పాములా.

"చూస్తే, నాది కాదండీ! సరే అని, గాభరాపడ్డాను."

"నేనూ అంతేనండి. బజారు వెళ్లి, బట్టలు కొనుక్కొని, రోజు గడిపాను. బట్టలూ, డబ్బూ, కాయితాలూ అన్నీ అందులోనే ఉన్నై" అన్నాడు రామదాసు.

"అవునండీ. రెండువందల యాభైరూపాయలు ఉన్నై. తెచ్చాను." అంది ఆమె.

సుభద్రకు నమ్మకం కుదురుతోంది.

"మీ అడ్రసన్నా దొరుకుతుందేమోనని మీపెట్టె అంతా కెలికానండి. ఊఁహుఁ. సరిగ్గా సర్దడంకూడా చాతకాక, అ వల్లాగే ఉంచాను" అన్నాడు రామదాసు.

ఆమె కొంచెం నవ్వింది.

సుభద్ర "ఆణవాళ్ల పెట్టెలు మొగాళ్లు సర్దలేకేం" అని దర్జాగా అంది.

"మా స్నేహితురాలి బట్టలు వేసుకుని, మీ అడ్వొకేట్ ఇంటికి వెళ్లి—"అంది ఆమె.

"మీరు వెళ్లారా ?" రామదాసు.

"ఆఁ. వాయిదాకు రమ్మని రాసిన కార్డు ఉందిగదూ. డబ్బూ, దస్తావేజులూ తెలుస్తున్నయ్యామె. వెళ్లాను మరి." బరువు దించుతున్నట్లు అంది ఆమె చివరిమాట.

"నే వెళ్లలేదు లెండి" అన్నాడు రామదాసు.

"అదే. మీరు రాలేదనీ, వొస్తే ఫలానాచోట మామూలుగా దిగుతారనీ గుమాస్తా చెప్పారు. వెంటనేరాలేక—"

"సాయింత్రం వొచ్చారన్న మాట. నిన్న వొచ్చింది తమరేనా ?" అని అందుకున్నాడు రామదాసు.

ఆమె అతని సూట్కేసు ఇచ్చి, డబ్బు వేరే ఇచ్చింది.

"క్షమించాలి. మీ పెట్టె తీశాను.—" అంటూ రామదాసు అన్నాడు.

"నేనూ తీశానుగా. క్షమాపణ దేనికండీ!" అంది ఆమె.

"మీ సబ్బూ, తలనూనే వాడాను. చీరలూ అవీ విచ్చలవిడిగా పారేశాను."

"నో మాటర్. దాందేముంది లెండి. ఇంతకూ మీ రెంత ఆదుర్దా పడ్డారో, కోర్టు కాయితాలు కూడాను!"

సుభద్రకు కొత్తఆమెమీద అభిమానం కలిగింది. దస్తావేజులమీద ఆమెకున్న శ్రద్ధ మొగుడి కుండకూడదూ!

రామదాసు తలనూనెసీసా, దువ్వెనా తెచ్చియిచ్చాడు. ఆమె చీరలూ, అవీ మడతలు పెడుతోంది.

" థాంక్యూ "

" థాంక్యూ "

" ఇదుగో, చెల్లీ, భోంచేసిపోదుగాని.-" అంటూ సుభద్ర.

" కాదండి, పని ఉంది. వెళ్లాలి " అంటూ కొత్తఆమె.

"ఊఁహు. వెళ్లటానికి వీల్లేదు" అంటూ భోంచెయ్యడానికి ఆమెను వొప్పించి, సుభద్ర మొగుడిపెట్టెలో తమ యింటి తువ్వాలాలు తీసుకుని, మొగుడికేసి తృప్తిగా చూచింది.

